క్లుప్తంగా

పెద్దిరెడ్డితో భేటీ



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో వైఎస్సార్‌సీపీ నాగలాపురం నేతలు

నాగలాపురం: ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు తరువాత స్థానిక వైఎస్సార్‌సీపీ మండల నేతలు ఉమ్మడి చిత్తూరు జిల్లా కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డిని మంగళవారం తిరుపతిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు పూర్తిగా చంద్రబాబు కుట్రేనని, ఆ తప్పుడు కేసులను సమర్ధవంతంగా, ధైర్యంగా ఎదుర్కొందామని పెద్దిరెడ్డి భరోసా ఇచ్చినట్లు వారు తెలిపారు. ఎవరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలోనే మిథున్ రెడ్డి బయటకు వస్తారని ధైర్యం చెప్పారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అపరంజిరాజు, రైతు సంఘ అధ్యక్షుడు చిన్నదొరై, మాజీ స్కూల్ ఛైర్మన్ ధనరాజ్, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఐటీ విభాగ కమిటీ మెంబరు చిరంజీవి, గజేంద్రన్ పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు స్పందన



పరీక్షిస్తున్న వైద్యులు

నాగలాపురం: స్విమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం మండలం కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ విజయ్ కుమార్ నేతృత్వంలో ఉచిత మొబైల్ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సహకారంతో స్విమ్స్ డైరెక్టర్, వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్ నేతృత్వంలో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు, మొబైల్ క్యాన్సర్, స్క్రీనింగ్ పరీక్షలు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ మేరకు ముందుగా మహిళలకు వైద్యులు క్యాన్సర్ లక్షణాలు, నివారణ చర్యలపై చిత్రపటాల ద్వారా అవగాహన కల్పించారు. బీపీ, షుగర్ పరీక్షలతో పాటు పింక్ బస్సులో పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ, గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్‌స్మియర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. మహిళలు, పురుషులు విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె.నాగరాజు, అరుణ్ కిశోర్, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిత, సీహెచ్‌ఓ వేణుగోపాల్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

శుక వాహనంపై షణ్ముఖుడు



పురవీధుల్లో ఊరేగుతున్న సుబ్రమణ్యస్వామి

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన సుబ్రహ్మణ్య స్వామి ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని చిలుక వాహనంపై మంగళవారం ఊరేగారు. ఈ సందర్భంగా అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ స్వామి అమ్మవార్లను చిలుక వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. ఈఓ బాపిరెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం సీజనల్ వ్యాధులపై వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతులను శుభ్రం చేసుకుని భోజనం చేయాలని, వేడిగా ఉన్న ఆహారాన్ని తినాలని తెలిపారు. వర్షాకాలంలో ముఖ్యంగా రెండు రకాల సీజనల్ వ్యాధులు ఉంటాయని, మొదటిది కలుషితమైన నీటిని తాగడం వల్ల, ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల టైఫాయిడ్, డయేరియా నీళ్ల విరోచనాలు వ్యాధులు వస్తాయని, రెండవది దోమల ద్వారా వచ్చే వ్యాధులు, దోమల వల్ల మలేరియా, వైరల్ ఫీవర్, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ధరేంద్ర సింగ్, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు,ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

నేడు నిరసన

సత్యవేడు: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్టును నిరసిస్తూ బుధవారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్ విగ్ర హం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సునీల్ కుమార్‌రెడ్డి తెలిపారు.

నేడు రీకాల్ బాబూస్ మేనిఫెస్టో

వరదయ్యపాళెం: ఇంటింటికీ రీకాల్ బాబు మేనిఫెస్టో కార్యక్రమంలో భాగంగా బుధవారం వరదయ్యపాళెంలోని కేబీజీ కల్యాణ మండపంలో మండలస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు నాయుడు దయాకర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

సమన్వయంతో అభివృద్ధి

వరదయ్యపాళెం: అందరి సమన్వయంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని, ఎమ్మెల్యే ఆదిమూలం సూచించారు. మంగళవారం వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ ఇళ్లు పూర్తి చేసేందుకు కృషి చేయాలని కోరారు.

అధ్వానం



శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిపై పర్యవేక్షణ కొరవడింది. కార్పొరేట్ స్థాయి వసతులు కల్పిస్తామని కూటమి నేతలు ఆర్భాటంగా ప్రకటనలు గుప్పించడం మినహా కార్యాచరణ శూన్యంగా మారింది. ప్రధానంగా ఆస్పత్రి ఆవరణలోని రోడ్లు అధ్వాన్నంగా మారడంతో రోగులు నానా అవస్థలు పడుతున్నారు. అత్యవసర విభాగానికి వెళ్లే మార్గం కంకర తేలి ప్రమాదకరంగా ఉండడంతో క్షతగాత్రులను తరలించేందుకు కుటుంబీకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సౌకర్యాల సంగతి దేవుడెరుగు.. కనీసం అంతర్గత రహదారులకైనా మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. – తొట్టంబేడు

ఆలస్యం



శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్గంలో పురపాలక నిధులు వెచ్చించి గోపాలకృష్ణారెడ్డి వాకింగ్ ట్రాక్ నిర్మించారు. అయితే నెలలు గడుస్తున్నప్పటికీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకుండా ఆలస్యం చేస్తున్నారు. దీంతో బాబు అగ్రహారం కోనేరు, వైష్ణవి కోనేరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వ్యాహ్యాళికి వెళ్లాల్సి వస్తోందని పట్టణంలోని వాకర్లు ఆరోపిస్తున్నారు. రూ.లక్షలు వ్యయంతో ఏర్పాటు చేసిన ట్రాక్‌లో పిచ్చిమొక్కలు పెరిగి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభించాలని కోరుతున్నారు. – తొట్టంబేడు

అక్రమం



స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలు ఆగడం లేదు. కూటమి నేతల అండతో యథేచ్ఛగా సాగుతోంది. అక్రమార్కులను అడ్డుకునేందుకు అధికారులు సైతం సాహసించడం లేదు. ప్రధానంగా రామలింగాపురం పరిధిలో స్వర్ణమ్మకు గర్భశోకమే మిగులుతోంది. ఈ క్రమంలోనే ఇసుక తరలింపునకు వినియోగించే ట్రాక్టర్లను మైనర్ బాలురు నడుపుతుండడం మరింత ప్రమాదకరంగా మారింది. బ్రేకులు కూడా సక్రమంగా అందని పిల్లలు ఓవర్‌లోడ్ వాహనాలను అధిక వేగంతో డ్రైవింగ్ చేస్తున్నారు. ఇసుక తవ్వకాలతోపాటు మైనర్ డ్రైవర్లపై అధికారులు దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణ నష్టం సంభవించకముందే తగు చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. ఇసుకాసురులను ఉక్కుపాదంతో అణచివేయాలని డిమాండ్ చేస్తున్నారు. – శ్రీకాళహస్తి

బుచ్చినాయుడుకండ్రిగలో ర్యాలీ నిర్వహిస్తున్న నూకతోటి రాజేష్, వైఎస్సార్‌సీపీ నేతలు



పల్లమాల గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయికులు



ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికం

- రెడ్‌బుక్ రాజ్యాంగంతో వైఎస్సార్‌సీపీని భయపెట్టలేరు
- ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులా ?
- భవిష్యత్‌లో మూల్యం చెల్లించుకోక తప్పదు
- పార్టీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్

బుచ్చినాయుడుకండ్రిగ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీపై కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని.. అందులో భాగంగానే రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అప్రజాస్వామికంగా అరెస్టు చేయించిందని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ తెలిపారు. మంగళవారం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కొణతనేని మణినాయుడు ఆధ్వర్యంలో బుచ్చినాయుడుకండ్రిగలోని వైఎస్‌రాజశేఖర రెడ్డి విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి, కరపత్రాలతో నిరసన చేపట్టి, మెయిన్‌రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్‌బుక్ రాజ్యాంగంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను భయపెట్టాలని చూస్తే భవిష్యత్తులో కూటమి నాయకులు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. అనంతరం మండల కన్వీనర్ మణినాయుడు మాట్లాడుతూ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని కక్షపూరిత రాజకీయాలు కోసం అరెస్టు చేయడం సబబుకాదని తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి సాయి నాయుడు, స్టేట్ ఎస్సీ సెల్ కార్యదర్శి ఉగ్గుముడి గురునాథం, నాయకులు జొన్నల గోపాల్‌రెడ్డి, రవి రెడ్డి, వైస్ ఎంపీపీ బాబురెడ్డి, నాయకులు అజయ్‌కుమార్‌రెడ్డి, దేవదాసురెడ్డి, గురవయ్య, అమరలింగయ్య, కారణిరమణయ్య, పెంచలయ్య, ప్రసాద్, అశోక్, నాగూర్, సంజీవయ్య, కిరణ్‌యాదవ్, సుబ్రమణ్యం, వెంకటేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌బుక్ వద్దు.. అంబేడ్కర్ రాజ్యాంగం కావాలి

రాష్ట్రంలో రెడ్‌బుక్ వద్దని.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం అమలు కావాలని జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి జొన్నలగోపాల్ రెడ్డి తెలిపారు. మిథున్‌రెడ్డి అరెస్టును ఖండిస్తూ పల్లమాల గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి, కూటమి ప్రభుత్వ అక్రమ అరెస్టుపై పార్టీ నాయకులతో కలసి విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. వైస్ ఎంపీపీ బాబురెడ్డి, నాయకులు సంజీవయ్య, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై ఆగ్రహం



మాట్లాడుతున్న నేతలు

తొట్టంబేడు : ప్రజలకు నష్టం చేకూర్చి, అదానీకి మేలు చేసేలా ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు తీసుకురావడం దారుణమని వివిధ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వామపక్ష, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆగస్టు 5వ తేదీన విద్యుత్‌శాఖ కార్యాలయాల వద్ద ధర్నాకు దిగనున్నట్లు వెల్లడించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు తీసుకువస్తామంటే వ్యతిరేకించిన నారా లోకేష్ ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. నాడు యువగళం పాదయాత్రలో స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేసే పగులగొట్టమని పిలుపునిచ్చి, ఇప్పుడు నోరు మెదపక పోవడమంటే ప్రజలను మోసం చేయడమేనని మండిపడ్డారు. స్మార్ట్‌మీటర్లు అమరిస్తే భవిష్యత్‌లో విద్యుత్ రంగం పూర్తిగా అదానీ చేతుల్లోకి వెళ్లిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రూఅప్, అదనపు చార్జీలు, స్మార్ట్‌మీటర్లు రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రొడ్డా గోపి, సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, అన్వర్ బాషా, లాల్ బాషా, కుమార్, జన విజ్ఞాన వేదిక జిల్లా నేత ఎస్‌ఎం షరీఫ్, జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకుడు పులి శ్రీకాంత్, ఎస్‌డీకే నగర్ పరిరక్షణ కమిటీ సభ్యులు గోవిందయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయలేక..



బాబు మోసాలను వివరిస్తున్న నూకతోటి రాజేష్

బుచ్చినాయుడుకండ్రిగ: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ విమర్శించారు. బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండల కన్వీనరు కొణతనేని మణి నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలో ఈబీసీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి బాబు మోసాల మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు అధికారం కోసం చంద్రబాబు అనేక హామీలు ఇచ్చారన్నారు. కూటమి నాయకులు ఎన్నికల సమయంలో తల్లికి వందనం పథకం ద్వారా బడికెళ్లిన ప్రతి బిడ్డకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు మోసం చేస్తున్నారని తెలిపారు. అర్హులైన చాలామందికి ఈ పథకం వర్తించలేదన్నారు. అలాగే దీపం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచితబస్సు, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి ఇలా ప్రతి పథకాన్ని చంద్రబాబు అటకెక్కించారని విమర్శించారు. ఓట్ల కోసం సూపర్‌సిక్స్‌తో మోసం చేసిన చంద్రబాబును అవకాశం వచ్చినప్పుడు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. దీనిపై స్పందించిన కాలనీవాసులు ఆయనను నమ్మి ఓట్లేసి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అందుకే ఈ విషయాలన్నీ ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి అందజేసిన బ్రోచర్‌లో క్యూఆర్ కోడ్‌ను సెల్‌ఫోన్‌లో స్కాన్ చేస్తే చంద్రబాబు మోసాలు కాలనీవాసులకు చూపించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మణినాయుడు, స్టేట్ గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి సాయినాయుడు, స్టేట్ ఎస్సీ సెల్ కార్యదర్శి గురునాథం, నాయకులు గోపాల్‌రెడ్డి, రవి రెడ్డి, బాబురెడ్డి, అజయ్‌రెడ్డి, గురవయ్య, దేవదాసురెడ్డి, అశోక్, సర్పంచ్ వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చెంగల్వరాయుడి కల్యాణం



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి కల్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుకు పలు రకాల అభిషేక పూజలు చేపట్టారు. మంగళవాయిద్యాలతో విజ్ఞానగిరికి వేంచేపు చేశారు. మంత్రోచ్ఛారణల నడుమ కల్యాణం జరిపించారు. ఈఓ బాపిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో కుట్రపూరిత పాలన



పిచ్చాటూరు బైపాస్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు




ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వేలూరు రాకేష్

నాగలాపురం: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని అరెస్టు చేయడం హేయమైన చర్య అని పిచ్చాటూరు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చలపతిరాజు అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం స్థానిక మండల నేతలతో కలిసి పిచ్చాటూరు బైపాసు రోడ్డు వద్ద వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. మొదట వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తోందని.. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వస్తున్న జనాదరణను చూసి ఓర్వలేక, మిథున్ రెడ్డిని జరగని లిక్కరు స్కాంలో ఇరికించి తప్పుడు కేసులు వేసి కుట్రపన్నుతున్నారని ఆరోపించారు. కూటమి అరాచకాలపై ప్రజలు తిరగబడే కాలం దగ్గరలో ఉందన్నారు. , ఎంపీ మిథున్ రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ నాయుడు, నియోజకవర్గ వలంటీర్ వింగ్ అధ్యక్షుడు రమేష్ రాజు, పార్టీ ఉప అధ్యక్షుడు సుబ్రమణ్యం రెడ్డి, జిల్లా కల్చరల్ వింగ్ సభ్యుడు సూరిబాబు రెడ్డి, జిల్లా రైతు విభాగ అధ్యక్షుడు చెంగల్‌రాయరెడ్డి, జిల్లా వలంటీర్ విభాగ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు త్యాగరాజు, మండల ఉప అధ్యక్షుడు రామచంద్రయ్య, సర్పంచ్‌లు శేఖర్, వెంకటేష్, అయ్యప్ప, నాయకులు ఆర్ముగం రెడ్డి, అయ్యప్ప, ప్రభాకర్ రెడ్డి, చంద్రశేఖర్, సెల్వం, చంద్రన్, మేషన్, కిరణ్, గోవిందరాజులు, ప్రజాప్రతినిదులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తప్పుడు కేసులు బనాయించి..

బుచ్చినాయుడుకండ్రిగ: కూటమి ప్రభుత్వంపై ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకత నుంచి దృష్టి మరల్చేందుకే వైఎస్సార్‌సీపీ నాయకులను ప్రభుత్వం టార్గెట్ చేస్తోందని ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వేలూరు రాకేష్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ కక్షపూరితంగా రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అరెస్టు చేసి పైశాచికానందం పొందుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వెనకడుగు వేయరన్నారు.

బడుల విలీనంపై నిరసన



ఎంఈఓ కార్యాలయం ఎదుట బైఠాయించిన నేతలు

ఏర్పేడు: ప్రభుత్వ పాఠశాలల విలీన ప్రక్రియను వ్యతిరేకిస్తూ మంగళవారం ఎంఈఓ కార్యాలయం ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ప్రజాసంఘాల నేతలు నిరసన తెలిపారు. బడుల విలీనంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే తగు చర్యలు చేపట్టకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నేతలు కరీముల్లా, రంగయ్య, దొరస్వామి, వెంకటాద్రి, రోశయ్య పాల్గొన్నారు.

అచ్యుతానందన్‌కు నివాళి

రేణిగుంట : కేరళ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ అచ్యుతానందన్‌కు మంగళవారం రేణిగుంట సీపీఎం కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం నేత వెంకటరమణ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమానికి జీవితం అంకితం చేసిన గొప్ప నేత అచ్యుతానందన్ అని కొనియాడారు. నేతలు తులసీ రాజన్, కుప్పుస్వామి, ఎంపీటీసీ సభ్యులు రాజేశ్వరి, రాజశేఖర్, దిలీప్, బాషా, ఈశ్వరి, మల్లీశ్వరి, భారతి పాల్గొన్నారు

మిథున్‌రెడ్డి అరెస్ట్ అక్రమం



పెద్దిరెడ్డితో సిరాజ్‌బాషా

శ్రీకాళహస్తి: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ అక్రమమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ సిరాజ్‌బాషా మండిపడ్డారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సిరాజ్‌బాషా మాట్లాడుతూ ఎలాంటి ఆధారాలు లేని మద్యం కేసులో మిథున్‌రెడ్డిని ప్రభుత్వం ఇరికించాలని యత్నించడం దారుణమన్నారు. త్వరలోనే ఆయన కడిగిన ముత్యంలా బయటకు వస్తారని స్పష్టం చేశారు.

ఉద్యోగ కల్పనే ధ్యేయం



కరపత్రం అందిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

రేణిగుంట : యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయమని మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రేణిగుంటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రభురావు, టీడీపీ మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్‌బాషా, సుబ్రమణ్యంరెడ్డి, పుష్పనాథన్ పాల్గొన్నారు.

వరుస చోరీలతో బెంబేలు

నాగలాపురం: మండల కేంద్రమైన నాగలాపురంలో ఇటీవల జరుగుతున్న వరుస చోరీలతో స్థానిక ప్రజలు, వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. నాలుగు రోజుల కిందట బంగారం దుకాణంలో ఇద్దరు మహిళలు బంగారం కొనుగోలు చేస్తామని చెప్పి 12 గ్రాముల రెండు బంగారం గొలుసులను అపహరించుకుని వెళ్లారు. అదేరోజు రాత్రి ఆ దుకాణంలోకి దుండగులు చోరీ కోసం చొరబడేందుకు ప్రయత్నం చేసి విఫలమయ్యారు. అయితే తాజాగా బజారువీధిలోని ముస్తఫా టెక్స్‌టైల్స్ వస్త్రదుకాణంలో చోరీ జరిగినట్లు బాధిత దుకాణదారుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మరో చోరీ వెలుగులోకి వచ్చింది. అయితే వస్త్రదుకాణంలో జరిగిన చోరీ కూడా గత శనివారం రోజు జరిగినట్లు బాధిత దుకాణదారుడు చెబుతున్నాడు. వస్త్రదుకాణంలో రూ.75 వేలు నగదు, రూ.35 వేలు విలువ కలిగిన వస్త్రాలను దోచుకెళ్లినట్లు వస్త్ర దుకాణాదారుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

తొట్టంబేడు: విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. పాయ్య దళితవాడకు చెందిన పార్వతమ్మ(55) ఇంటి వద్ద దుస్తులను ఇనుప కమ్మీపై ఆరేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురైందిది. కుటుంబ సభ్యులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

వ్యక్తికి గాయాలు

తొట్టంబేడు: వరదయ్యపాళెం ఎస్టీకాలనీకి చెందిన వెట్టి భాస్కర్ మంగళవారం ఏర్పేడు మండలం మూలకండ్రిగకు వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. స్థానికులు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.